# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ కృత్రిమ మేధ వినియోగాన్ని నిర్దేశించడంలో 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' ఒక కీలక మలుపుగా నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్”లో పేర్కొన్నారు.

- ❖ ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని తపాల శాఖ రూపురేఖలను మారుస్తామని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు.

- ❖ రాష్ట్రంలో పార్శిల్స్ పంపిణీ కోసం గ్రామీణ డాక్ సేవక్‌లను వినియోగించుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

- ❖ టీ-20 ప్రపంచ కప్-2026 సూపర్-8 లో భాగంగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది.

========================

కృత్రిమ మేధ (AI) శక్తిని ప్రపంచం భవిష్యత్‌లో ఎలా వినియోగించుకోవాలో నిర్దేశించడంలో భారత్ వేదికగా జరిగిన “ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026” ఒక కీలక మలుపుగా నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆకాశవాణి ద్వారా తన మనసులోని భావాలను పంచుకునే “మన్ కీ బాత్” 131 సంచిక కార్యక్రమంలో ఆయన దేశప్రజలను ఉద్దేశించి ఈరోజు ప్రసంగించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఏఐ సమ్మిట్ ప్రపంచంలోనే అతిపెద్ద సదస్సుగా నిలిచిందని ప్రధాని తెలిపారు. ఏఐ ద్వారా పశువుల ఆరోగ్యాన్ని 24 గంటలూ ఎలా పర్యవేక్షిస్తున్నారో చూసి ప్రపంచ దేశాల నేతలు ఆశ్చర్యపోయారన్నారు. అలాగే ప్రాచీన గ్రంథం `సుశ్రుత సంహిత`ను ఏఐ ద్వారా ఆధునిక భాషల్లోకి అనువదించిన తీరు మన సంస్కృతికి, సాంకేతికతకు ఉన్న అనుసంధానానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఏడాదికి 15 కోట్ల టన్నుల బియ్యాన్ని ఉత్పత్తి చేస్తూ భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందని, మన రైతులు నాణ్యతతో పాటు విదేశీ ఎగుమతులపై దృష్టి సారిస్తున్నారని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

========================

డిజిటల్ మోసాల పట్ల ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని ప్రధానమంత్రి హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగే దందాలు క్షమార్హం కావని, ఓటీపీ, ఆధార్ నంబర్లు ఎవరికీ చెప్పవద్దని ఆయన సూచించారు. ఆకాశవాణి ద్వారా మనసులోని భావాలను పంచుకునే `మన్ కీ బాత్` 131 సంచిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేరళకు చెందిన పది నెలల చిన్నారి ఆలిన్ షెరిన్ అబ్రహం మరణానంతరం ఆమె తల్లిదండ్రులు తీసుకున్న అవయవ దాన నిర్ణయాన్ని ప్రధాని ప్రశంసించారు. కేరళలోని భరతపూజ నది తీరంలో 250 ఏళ్ల తర్వాత మళ్లీ కేరళ కుంభమేళా "మామంగం" ఘనంగా జరగడంపై ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న టీ-20 ప్రపంచ కప్‌లో భారత సంతతి క్రీడాకారుల ఆటపై ప్రధానమంత్రి హర్షం వ్యక్తం చేశారు. కెనడా, అమెరికా, ఓమన్ వంటి జట్లలో మన దేశ మూలాలున్న ఆటగాళ్లు కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. భారతీయులు ఎక్కడ ఉన్నా తమ మూలాలను మర్చిపోరని, వారు నివసిస్తున్న దేశాల అభివృద్ధికి కృషి చేస్తూనే భారతీయతకు గర్వకారణంగా నిలుస్తున్నారని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రసాద్' (PRASHAD) పథకం కింద రాష్ట్రంలోని ఆలయాల పరిసరాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. చిత్తూరు జిల్లాలోని కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ప్రసాద్ పథకం ద్వారా ఆలయాలు పట్టణాల మధ్య కనెక్టివిటీని పెంచడం, మెరుగైన పారిశుధ్యం, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించామని తెలిపారు.

విరామం

=======================

వికసిత్ భారత్ సాధనలో తపాలా శాఖ భాగస్వామ్యం పెరిగేలా కృషి చేస్తున్నామని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. గుంటూరు నగరంలో నిర్వహించిన 'గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం'ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ లతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ... ఆధునిక సాంకేతికతను వినియోగించుకును పోస్టల్ శాఖ రూపు రేఖలను మారుస్తామన్నారు. సుదూర ప్రాంతాల డెలివరీ మరింత వృద్ధి చేయటానికి ఎలక్ట్రిక్ బైక్ లు అందించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. కొండ ప్రాంతాలలో డ్రోన్లను ఉపయోగిస్తామని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. గ్రామీణ డాక్ ల సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. రాష్ట్రంలో పార్శిల్స్ పంపిణీలో గ్రామీణ డాక్ సేవక్ ల సేవలు వినియోగించుకుంటామని పేర్కొన్నారు. ఎంత సాంకేతికత వచ్చినా గ్రామీణ డాక్ సేవక్ లకు ప్రత్యామ్నాయం లేదన్నారు.

=======================

సమాజంలోని అన్ని వర్గాలకు పారదర్శక పాలన, సంక్షేమ ఫలాలను అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన ఈరోజు మీడియాతో మాట్లాడుతూ... ప్రజలకు సంక్షేమం, సుపరిపాలన అందించడమే కేంద్ర ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తిరుమలలో శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసి రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, రైతు సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. కేంద్రం తీసుకుంటున్న చొరవ వల్ల రాష్ట్రంలో ఆధునిక సాగు పద్ధతులపై

అవగాహన పెరిగిందని, దీనివల్ల సాగు ఖర్చు తగ్గి రైతుల ఆదాయం వృద్ధి చెందుతోందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో సూక్ష్మ సాగు (Micro Irrigation) పథకానికి సంబంధించి కేంద్రం నుంచి రావాల్సిన 645 కోట్ల రూపాయల బకాయి నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు.

========================

టీ-20 ప్రపంచ కప్ 2026 సూపర్-8 గ్రూప్-1 విభాగంలో భాగంగా భారత్, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. అహమ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఈ మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. గ్రూప్-2 విభాగంలో భాగంగా మరో మ్యాచ్‌లో శ్రీలంకపై ఇంగ్లాండ్ జట్టు 51 పరుగుల తేడాతో విజయం సాధించింది. శ్రీలంకలోని పల్లకెలె స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 146 పరుగుల చేయగా.. శ్రీలంక 16.4 ఓవర్లలో 95 పరుగులకు ఆలౌట్ అయ్యింది.

========================

స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు జరుపుకున్నారు. ఆంధ్ర ప్రాంతంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తొలి తెలుగు స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతి కలెక్టరేట్ లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి కలెక్టర్ నివాళులు అర్పించారు. విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ మాట్లాడుతూ… బ్రిటిష్ వారి అన్యాయమైన శిస్తు వసూళ్లు, పాలెగాళ్ల వ్యవస్థ రద్దును వ్యతిరేకిస్తూ.. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సాయుధ పోరాటం చేశారని పేర్కొన్నారు.

========================
========================